# పోలింగ్ ప్రశాంతం



ఝురాసంగం: ఓటు వేయడానికి క్యూలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

**ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు**

- ఉత్సాహంగా ఓటు వేసిన కొత్త ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు
- సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోల్‌లో కాంగ్రెస్ నేతల దౌర్జన్యం

సంగారెడ్డి, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం ఎన్నికలు జరిగాయి. సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ క్రమంగా పుంజుకుంది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించటం, ఓటర్లు ఆలస్యంగా ఓటింగ్‌కు రావటంతో 5గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

సంగారెడ్డి జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతోపాటు పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ సదాశివపేటలోని కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి క్యూలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పటాన్‌చెరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందోలు ఎమ్మెల్యే అభ్యర్థి చంటిక్రాంతికిరణ్ తన స్వగ్రామం పోతులబోగూడలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కొణింటి మాణిక్‌రావు ఝురాసంగంలో పూజలు చేసిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఝురాసంగంలో ఓటు వేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి తన స్వగ్రామం ఖానాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. కార్పొరేషన్ చైర్మన్లు నరోత్తం, తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తమ స్వగ్రామాల్లో ఓటు వేశారు. సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాణిక్యం, మామిళ్ల రాజేందర్, బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి తదితరులు ఓట్లు వేశారు.

**మొరాయించిన ఈవీఎంలు**

సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సాంకేతిక కారణాలతో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. నారాయణఖేడ్ మండలం జూకల్, సంజీవరావుపేట, సిర్గాపూర్‌లో, వాసర్, పెద్దశంకరంపేట శివాయిపల్లిలో ఈవీఎంలు మొరాయించాయి. సిర్గాపూర్ మండలం గరిడేగావ్, నాగల్‌గిద్ద మండలం గొండేగావ్, నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట, తుర్కపల్లి కంగ్టి మండలం తుర్కవాడ్‌గామ, నిజాంపేట మండలం రాంరెడ్డిపేట గ్రామాల్లో ఓటర్లు భారీ సంఖ్యలో ఉండటంతో 5గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది. కొండాపూర్ మండలం గొల్లపల్లి, సంగారెడ్డి పట్టణంలోని సెయింట్‌జోసఫ్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు సరిగ్గా పనిచేయలేదు. జోగిపేట పట్టణంలోని పలువార్డుల్లో 5గంటల తర్వాత పోలింగ్ కొనసాగింది.



ఓటుహక్కు వినియోగించుకున్న సంగారెడ్డి అభ్యర్థి చింతాప్రభాకర్ దంపతులు

**కాంగ్రెస్ శ్రేణుల దౌర్జన్యం**

సంగారెడ్డి పట్టణంలోని నాల్సాబ్‌గడ్డ ప్రాంతంలో కాంగ్రెస్ మైనార్టీ నేతలు బీఆర్ఎస్ మైనార్టీ నాయకులతో గొడవకు దిగారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఘర్షణలకు దిగిన నాయకులను అదుపులోకి తీసుకున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కడ్చల్, ఊట్‌పల్లి, చీమల్‌పాడ్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు గొడవలకు దిగటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బొల్లారంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులతో గొడవకు దిగారు. పటాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ భార్య సుధారాణి ఇస్నాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ప్రయత్నం చేసింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేయగా కాంగ్రెస్ కార్యకర్తలకు గొడవకు దిగారు. పోలీసులు కలుగజేసుకుని కాంగ్రెస్ నాయకులను చెదరగొట్టారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో గ్రామ కార్యదర్శి అనిత బీఎస్పీకి ఓటు వేయాలని పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేయటంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ విషయమై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పంచాయతీ కార్యదర్శి అనితను ఎన్నికల విధుల నుంచి తొలగించారు. అందోలులో కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయటంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

**స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరుకున్న ఈవీఎంలు**

జిల్లాలోని 1609 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు జరిగాయి. 7068 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. అలాగే 4500 పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం ఐదు నియోజకవర్గాల్లోని ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను తీసుకుని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఐదు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను గీతం యూనివర్సిటీలో భద్రపర్చారు.



కుటుంబ సభ్యులతో ఓటు వేసిన ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి



అందోల్: కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్



ఖానాపూర్ కేలో కుటుంబ సభ్యులతో ఓటు వేసిన ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి



న్యాల్‌కల్: ఇబ్రహీంపూర్‌లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఓటర్లు



ఝురాసంగం: ఎల్గోయిలో కుటుంబంతో కలిసి ఓటు వేసిన సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్


# సంగారెడ్డిలో 73.83 శాతం పోలింగ్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్
- మందకొడిగా ప్రారంభమై ఊపందుకున్న పోలింగ్
- సాయంత్రం 5గంటల తర్వాత కూడా కొనసాగిన ఓటింగ్
- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ ప్రక్రియ

సంగారెడ్డి నవంబర్ 30(నమస్తే తెలంగాణ)/ సంగారెడ్డి కలెక్టరేట్: సంగారెడ్డి జిల్లాలో 73.83 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం పోలింగ్ జరిగింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరిగింది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించటంతో 5గంటల తర్వా త కూడా పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7గంటల తర్వాత కూడా ఓటింగ్ కొనసాగింది. అలాగే కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉండటంతో పోలింగ్ రాత్రి 7గంటల వరకు కొనసాగింది. దీంతో అధికారులు సాయంత్రం 5గంటలకు ప్రకటించిన పోలింగ్ శాతం కంటే మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం 5గంట ల వరకు జిల్లాలో 73.88 శాతం పోలింగ్ నమోదైంది. నారాయణఖేడ్ అసెంబ్లీలో 75.34 శాతం, అందోల్‌లో 76.12 శాతం, జహీరాబాద్‌లో 79.84 శాతం, సంగారెడ్డిలో 70.01 శాతం, పటాన్‌చెరులో 69.72 శాతం నమోదైంది.

**మధ్యాహ్నానికి ఊపందుకున్న పోలింగ్**

జిల్లాలో ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఊపందుకుంది. సంగారెడ్డి జిల్లాలో ప్రతిరెండు గంటల పోలింగ్ శాతం సరళిని పరిశీలిస్తే 12 గంటల తర్వాత పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. ఉదయం 7గంటల నుంచి 9గంటల మధ్య ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తిచూపలేదు. 9 తర్వాతే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావటం ప్రారంభించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఉదయం 9గంటలకు సంగారెడ్డి జిల్లాలో 9.94 శాతం పోలింగ్ నమోదైంది. 11 గంటలకు 21.99 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 1గంటలకు 4.17 శాతం, 3గంటలకు 55.97 శాతం, సాయంత్రం 5గంటలకు 73.83 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 7గంటల వరకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగినందున పోలింగ్ శాతం మరింత పెరగనున్నది.



ఝురాసంగం: ఓటేసిన తర్వాత ఈదులపల్లి గ్రామస్తులతో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్